క్లుప్తంగా

ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోవాలి



లొల్లలో అధికారులకు సూచనలు చేస్తున్న జేసీ ధ్యానచంద్ర

ఆత్రేయపురం: రైతులు రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే)లను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్(జేసీ) ధ్యానచంద్ర రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని లొల్లలో ఆర్బీకేలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్బీకేల ద్వారా రైతులు గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్ఐ భవానీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దళితులను కించపరిస్తే గుణపాఠం చెబుతాం

అంబాజీపేట: రాజకీయాల్లో అపార అనుభవం కలిగిన వ్యక్తులు దళితులను కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని వారికి తగిన గుణ పాఠం చెబుతామని కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ చెప్పారు. మాచవరంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పీకే రావు కొబ్బరి గొడౌన్ వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వాలు దళితులను కించపరుస్తూ మాటాడుతున్నారన్నారు. దళితుడైన అంబేడ్కర్ అన్ని కులాలకు హక్కులు కల్పించారని, అయితే దళితులను కించ పరిస్తే అంబేడ్కర్‌ను కించపరచడమేనన్నారు. రాజకీయాల్లో అనుభవం కలిగిన మాజీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి, వర్ల రామయ్యలు దళితులను కించ పరుస్తూ మాట్లాడుతున్నారని వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ముఖ్యంగా యువగళం నిర్వహిస్తున్న నారా లోకేష్ కూడా దళితులను కించ పరుస్తూ వ్యాఖ్యలు చేశారన్నారు. వీరందరూ తమ వ్యాఖ్యలు వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని లేకుంటే భవిష్యత్‌లో దళితులను ఓట్లు అడిగే హక్కు కోల్పోతారన్నారు. నియోజకవర్గంలో కొందరు చంద్రబాబు వద్ద వారి ఉనికిని కాపాడుకునేందుకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలపై నోర్లు పారేసుకుని దూషిస్తున్నారని అలాంటి వ్యక్తులను రోడ్లపై తిరగనివ్వకుండా జనమే బుద్ధి చెబుతారని దళిత నాయకులు హెచ్చరించారు.

పాఠశాలకు భోజన ప్లేట్లు వితరణ



అంతర్వేది దేవస్థానం పాఠశాలలో పిల్లలకు భోజన ప్లేట్లు ఇస్తున్న సత్యకిరణ్

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలోని యూపీ స్కూల్‌కు పశ్చిమగోదావరి జిల్లా ఉండికి చెందిన నల్లా విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన 72 మంది పిల్లలకు భోజన ప్లేట్లు మంగళవారం పంపిణీ చేశారు. వీటిని ట్రస్ట్ అధినేత సత్యకిరణ్ ప్రసాద్ పిల్లలకు అందజేశారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైర నాగరాజు, స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ టి.పద్మ, హెచ్ఎం శ్రీవిద్య, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

మేలు జాతి దూడలతోనే అధిక పాల ఉత్పత్తి

అయినవిల్లి: మేలు జాతి పెయ్య దూడలతోనే అధిక పాలు ఉత్పత్తిని పెంచవచ్చని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కర్నీడి మూర్తి అన్నారు. సిరిపల్లిలో సర్పంచ్ కుడుపూడి శాంతావతి అధ్యక్షతన మంగళవారం మేలు జాతి పెయ్యదూడల ఉత్పత్తి, జాతీయ కృత్రిమ గర్భధారణ వంటి అంశాలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సభకు జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా వ్యవహరించారు. అనంతరం పాడి పశువులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మట్టపర్తి వెంకటరమణ, యడ్ల కిరణ్, కుడుపూడి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల కోసం గ్రామ సచివాలయాల్లో దశల వారీగా ఏర్పాటు చేస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్ కోరారు. ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం జరిగింది. మండలంలోనున్న 24 గ్రామ సచివాలయ పరిధిలో 4187 మంది చిన్నారులు ఆధార్ నమోదు చేసుకోవలసి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల దృష్ట్యా ఈనెల 18 నుంచి 27 వరకూ నిర్దేశించిన సమయాల్లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిపై చిన్నారుల తల్లిదండ్రుల్లో విస్తృత ప్రచారం కల్పించాలని అంగన్‌వాడీలను వారు ఆదేశించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, బి.వరలక్ష్మి, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

భౌతిక్క దాడులు

- వేసవి తాపానికి జంతువుల్లో ప్రత్యేక లక్షణాలు
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరిక



అంబాజీపేట ప్రధాన రహదారిపై సంచరిస్తున్న వీధి కుక్కలు

అంబాజీపేట: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతూ ఉండటంతో కుక్కలు ఎండ వేడిమిని తట్టుకోలేక పిచ్చిపిచ్చిగా ప్రవరిస్తున్నాయి. కనిపించిన వారిపై దాడికి పాల్పడుతున్నాయి. వేసవి ఎండలకు, ఉక్కపోతలకు జంతువుల్లో కూడా ప్రత్యేక లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. సమ్మర్ ఎఫెక్ట్ కుక్కల్లో ఎక్కువగా కనిపిస్తుందని, వేసవి తాపాన్ని తట్టుకోలేక కనిపించిన వారిని కరిచేందుకు ప్రయత్నిస్తాయని పేర్కొంటున్నారు. వాటి జోలికి వెళితే మరింత ఎగబడి తీవ్రంగా గాయపరుస్తాయని వివరిస్తున్నారు. కుక్కకాటును నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పిల్లలు ఆటలాడుకుంటూ కుక్కల వద్దకు వెళ్లినా, అవి దాడి చేసే ప్రమాదం ఉన్న దృష్ట్యా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో రెండు నెలలుగా 1523 కేసులు నమోదయ్యాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఎక్కడ చూసినా వీధి కుక్కలు బాటసారులను, వాహనాలపై వెళుతున్న వారిపై దాడి చేసిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. స్థానికులు ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా పోయింది. గడిచిన రెండునెలల్లో ఆయా గ్రామాల పీహెచ్‌సీల పరిధిలోని అంబాజీపేట 84, అయినవిల్లి 90, పి.గన్నవరం 162, అవిడిలో 31, గోపాలపురంలో 88, లక్కవరంలో 130, లూటుకుర్రులో 31, మోరిలో 113, ముక్కామలలో 49, నగరంలో 90, నాగుల్లంకలో 33, రామేశ్వరంలో 50, ర్యాలిలో 95, సఖినేటిపల్లిలో 46, తాటిపాకలో 40, ఊబలంకలో 117, వానపల్లిలో 36, వీరవల్లిపాలెంలో 30, కొత్తపేట సీహెచ్‌సీలో 206 కేసులు నమోదయ్యాయి. వీరిలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను అమలాపురం ఏరియా ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించినట్లు వైద్యాధికారులు చెప్పారు.

రేబిస్ వ్యాధి లక్షణాలు..

మనుషులు రేబిస్ వ్యాధికి గురైనప్పుడు దవడ, గొంతు కండరాలకు పక్షవాతం వస్తుంది. ఎంత దాహం వేసినా నీటిని తాగలేరు. ఎక్కువ సందర్భాల్లో రోగి నీటిని చూసినా, నీటి శబ్దం విన్నా భయకంపితులవుతారు. ఈ లక్షణాన్ని హైడ్రోఫోబియా అని పిలుస్తారు. ఇలాంటి స్థితిలో మతిస్థిమితం కోల్పోయి ఊపిరి పీల్చుకోలేక మరణిస్తారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ర్యాబీపూర్ వ్యాక్సిన్ చేస్తున్నారు. అత్యవసర విభాగంలో అన్ని వేళలా అందుబాటులో ఉంటుంది. కుక్కకరిచిన రోజు, మూడో రోజు, ఏడో రోజు, 28వ రోజు మొత్తం నాలుగు సార్లు ర్యాబీపూర్ ఇంజక్షన్లు చేయించాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



కుక్క కరిచిన వెంటనే గాయాన్ని చల్లటి నీటితో సబ్బుతో కడగాలి. నీరు ధారగా పడే విధంగా చేయాలి. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయాలి. కుట్లు వేయడం, ఆయింట్‌మెంట్ పూయడం, గాయాన్ని నిప్పుపెట్టి కాల్చడం, కోయడం వంటివి చేయకూడదు. కుక్క కరిచిన వెంటనే సాధ్యమైనంత మేరకు త్వరగా వైద్యుల్ని సంప్రదించి టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. పెంపుడు కుక్కలకు కూడా టీకాలు వేయించాలి.

– వి.గౌతమి, పీహెచ్‌సీ వైద్యాధికారి, అంబాజీపేట

పారదర్శక పాలనకు చిరునామా జగనన్న ప్రభుత్వం

కొత్తపేట: సీఎం జగన్ ప్రభుత్వం పారదర్శక పాలనకు చిరునామాగా నిలిచిందని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మండలంలోని గంటిలో జెడ్పీ నిధులు రూ.2 లక్షలతో చేపట్టే అంగన్‌వాడీ సెంటర్ ఆధునీకరణ పనులను మంగళవారం ఎంపీపీ గంగాధరరావు ప్రారంభించారు. గంగాధరరావు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో దళారీ వ్యవస్థల దయాదాక్షిణ్యాలతో అరకొర పథకాలు పొందాల్సి వచ్చేదని, అవి కూడా అర్హులకు కాకుండా అనర్హులకే దక్కేవన్నారు. ఆ విధానానికి విరుద్ధంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక పార్టీ లేదు, కులం లేదు, మతం లేదు.. అర్హులైతే చాలు ఎవరి మధ్యవర్తిత్వంతో పని లేదు. నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే పథకాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల సేవాదళ్ కన్వీనర్ గూడపాటి ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దన్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మట్టపర్తి వెంకట్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు పోలిమాటి అంజనీకుమారి, యడ్ల కృష్ణమూర్తి, పార్టీ దళిత నాయకుడు పంతగాడి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

అంబాజీపేట: రాజమహేంద్రవరంలో వచ్చే నెల 7న జరిగే ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి పిలుపునిచ్చారు. ముక్కామల వాసవీ సత్రంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కాజ సురేష్ అధ్యక్షతన సంఘ సమావేశం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి ఆర్యవైశ్యులను చైతన్య పరచడమే ధ్యేయంగా జిల్లా నాయకులు కృషి చేయాలని కోరారు. ఉమ్మడిగోదావరి జిల్లాల్లో ఆర్యవైశ్యుల రాజకీయ, సామాజిక, సాంఘిక సమస్యలను చర్చించేందుకు శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగే సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. అమలాపురం జోన్ కన్వీనర్ శింగంశెట్టి నగేష్, పి.గన్నవరం మండల సంఘ అధ్యక్షుడు పెంటపాటి శ్రీనివాసు, అంబాజీపేట సంఘ గౌరవ అధ్యక్షుడు వెదుళ్లపల్లి కుమార్ (పెదబాబు), ముంగండ సంఘ అధ్యక్షుడు జల్లూరి నాగేశ్వరగుప్త, జిల్లా డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అంబాజీపేట: వేసవి దాహార్తి తీర్చేందుకు అంబాజీపేట సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని పతంజలి స్టోర్స్ వద్ద మంగళవారం ప్రారంభించారు. తాపం నుంచి మజ్జిగ సేదతీరుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యకూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా దాతలు ముందుకు రావాలని కోరారు.

నేటి నుంచి ఫీవర్ సర్వే

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం నుంచి ప్రత్యేక ఫీవర్ సర్వే నిర్వహించనున్నట్లు పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పెనికేరులో కోవిడ్ లక్షణాలతో ఒకరు మృతి చెందారన్న నేపథ్యంలో ఈ ఫీవ ర్ సర్వేను చేపడుతున్నామన్నారు. జ్వరంతో కాని ఇతర సమస్యలతో బాధపడుతున్న వారు కాని సత్వరమే సమీప వైద్యారోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు.

23న గురుకులంలో ప్రవేశాలకు పరీక్షలు

పి.గన్నవరం: నరేంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఈనెల 23న పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్ తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు ఉదయం 10 గంటల నుంచి, ఇంటర్‌లో ప్రవేశాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి పరీక్షలు జరుగుతాయని ఆయన వివరించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లు తీసుకు రావాలని ఆయన సూచించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- మెర్లపాలెం, మాచవరంలలో గడప గడపకూ..



మెర్లపాలెంలో గడప గడపకూ ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



మాచవరంలో లబ్ధిదారునికి బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మెర్లపాలెంలో మంగళవారం ఉదయం, సాయంత్రం గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వాన్ని ప్రజల వద్దకు చేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు అపూర్వరీతిలో మద్దతు పలుకుతున్నారన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా, ఏ ప్రభుత్వంలో ఎంత లబ్ధి పొందారో ప్రజలకు తెలుసని, ప్రతిసారి బటన్ నొక్కి వారి ఖాతాలకు సంక్షేమ పథకాల సొమ్మును అందించిన సీఎం జగన్ ప్రభుత్వానికి విజ్ఞులైన ప్రజలు సమయం వచ్చినప్పుడు ఒక్కోసారి బటన్ నొక్కి తమ కృతజ్ఞతలు తెలుపుతారన్నారు. గత ప్రభుత్వంలో కేవలం వైఎస్సార్ సీపీ అభిమానులైన కారణంగా అర్హత ఉన్న వృద్ధులు, వికలాంగులకు సైతం పింఛన్లు రాకుండా అప్పటి జన్మభూమి కమిటీలు అడ్డుకున్నాయన్నారు. మెర్లపాలెంలో మాజీ సర్పంచ్ జంపన సుబ్బరాజు, పార్టీ సీనియర్ నేతలు పోలిమాటి రాజారత్నం, త్రిమూర్తులు, నాని, వీర్రాజు తదితరులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వివరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, కొల్లి శ్యాంసన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోన్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మాచవరం సచివాలయం-4లో పార్టీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజుల ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతీ గడపకూ వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. చిట్టిబాబు, ఇజ్రాయిల్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం జగన్ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని గిమ్మిక్కులు, కుట్రలు, కుతంత్రాలు పన్నినా 2024లో తిరిగి జగన్ సీఎం కావడం ఖాయమన్నారు. అనంతరం లబ్ధిదారులకు బ్రోచర్‌లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ విభాగ కన్వీనర్ పేరి శ్రీనివాస్, ఎంపీటీసీ మట్టా పార్వతి, పార్టీ జిల్లా ప్రచార విభాగ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, కుసుమ శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, డీఏ పునరుద్ధరించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబుకు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు వీఆర్ఏలు అందజేశారు.



వేగివారిపాలెంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సంక్షేమాభివృద్ధి దిశగా అడుగులు: ఎమ్మెల్యే రాపాక

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమాభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మంగళవారం వేగివారిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామస్థాయిలో సుపరిపాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థను అమలు చేశారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్ పప్పొప్పుల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సునీత, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కోటపల్లి ఎస్తేరురాణి, సత్యసాయిరామ్, మట్టా ఏడుకొండలు, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

మామిడికుదురు: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్నామని పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. పాశర్లపూడిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. సత్యనారాయణ మాట్లాడుతూ దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దన్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,040, గ్రేడ్ ఎ రకం రూ.2,060 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ గంధం మాణిక్యం, సీఈఓ వై.ఏసురావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉదయ్, టెక్నికల్ అసిస్టెంట్ వికాస్, నరేష్, సుబ్రహ్మణ్యం, రైతులు బొరుసు వెంకటేశ్వరరావు, బొక్కా రంగయ్య, బొరుసు సూరిబాబు, వాసంశెట్టి సురేంద్ర పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ



లూటుకుర్రులో తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ చేపట్టామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.49.33 లక్షలతో పాశర్లపూడిలంకలో నిర్మించిన తాగునీటి ట్యాంకును, రూ.74.57 లక్షలతో లూటుకుర్రులో నిర్మించిన ట్యాంకును, పైప్‌లైన్‌ను ఎమ్మెల్యే చిట్టిబాబు మంగళవారం ప్రారంభించారు. చిట్టిబాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ నిధులతో నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తున్నామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కళిరెడ్డి అంజిబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు, నెల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్య, యూవీవీ సత్యనారాయణ, ముత్యాల నర్సింహారావు, ఎంపీటీసీలు నామన వెంకటేశ్వరరావు, సీహెచ్ పార్వతీదేవి, చిట్టూరి రామకృష్ణ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



వలంటీర్లను సన్మానిస్తున్న గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిత్యకుమార్

మామిడికుదురు: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తూ వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్ పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తులో మంగళవారం మామిడికుదురులో ముగిసింది. దీనిలో భాగంగా వలంటీర్లను, గృహ సారథులను ఆయన ఘనంగా సత్కరించారు. వారికి పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర చాలా కీలకంగా మారిందన్నారు. మన రాష్ట్రంలో అమల్లో ఉన్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, నయినాల సీతామహాలక్ష్మి, వర్ధినేని రాము, పార్టీ నేతలు కంచి శ్రీరామ్, నయినాల శివ, మొల్లేటి సత్యనారాయణ, బొక్కా వెంకటేశ్వరరావు, అనిశెట్టి రాజు, యన్నాబత్తుల కృష్ణకుమారి, పిచ్చుక బుల్లియ్య, కంచి మురళి, సాపే ప్రసాద్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కొత్తపేట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం పెట్రోల్ బంకు, గ్యాస్ గొడౌన్ వద్ద సిబ్బందికి స్థానిక అగ్నిమాపక సిబ్బంది 'అగ్నిప్రమాదాలు–నివారణ చర్యల'పై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో మండలంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద సిబ్బందికి పెట్రోల్ ప్రమాదాలు–తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. స్థానిక గ్యాస్ గొడౌన్ వద్ద వివిధ సందర్భాల్లో ప్రమాదాల గురించి ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత శిక్షణతో విద్యార్థులకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ

మామిడికుదురు: ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ సూచించారు. స్థానిక నయినాల రావూజీ రంగ మెమోరియల్ బీసీ సామాజిక భవనంలో మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణను మంగళవారం ప్రారంభించారు. సంఘం మండల శాఖ అధ్యక్షుడు నయినాల రఘురామయ్య అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ మరియు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిక్షణ జరుగుతుందన్నారు. ఈ సువర్ణావకాశాన్ని ఔత్సాహికులైన విద్యార్థులు వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. గుత్తుల వీరబ్రహ్మం, రాయుడు నాగేశ్వరరావు సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి సుబ్బరాజు, మండల ప్రధాన కార్యదర్శి కాగితాలపల్లి నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి కుడుపూడి ప్రవీణ్ పాల్గొన్నారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్తు

అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం

అంబాజీపేట: వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సారథ్యంలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీల మండల శాఖ అధ్యక్షు ముత్తాబత్తుల ప్రశాంత్ అన్నారు. ఇసుకపూడిలో జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆ ఇంటి పెద్దతో మాట్లాడి స్టిక్కర్లను అతికించి, బ్రోచర్‌ను ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. రాజోలు ఏఎంసీ ఉపాధ్యక్షుడు సుంకర బాబ్జి పాల్గొని మాట్లాడుతూ సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగన్ రాష్ట్ర ప్రజలకు ఆర్థిక భరోసా ఇస్తున్నారని అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ యెనుముల నారాయణస్వామి, అడబాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఖండ్రిగలో..



ఖండ్రిగలో జగనన్నే మా భవిష్యత్‌లో సర్పంచ్ రెడ్డి చంటి తదితరులు

కొత్తపేట: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ని మళ్లీ గెలిపించుకుందామని అవిడి సర్పంచ్, ఖండ్రిగ గ్రామ జగనన్నే మా భవిష్యత్ ఇన్‌చార్జ్ రెడ్డి చంటి పిలుపునిచ్చారు. మంగళవారం ఖండ్రిగలో సర్పంచ్ దూనబోయిన నవదీప, ఎంపీటీసీ సభ్యురాలు పితాని లక్ష్మీతులసి తదితర నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటా జగనన్నే మా భవిష్యత్ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పితాని రాంబాబు, వీడీసీ కన్వీనర్ దూనబోయిన శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొకాంక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా బైక్ నడిపిన యువకుడిపై కేసు

రావులపాలెం: రోడ్డుపై నిర్లక్ష్యంగా బైక్ నడిపిన యువకుడిపై కేసు నమోదు చేసినట్టు రావులపాలెం ఎస్సై ఎం.వెంకటరమణ మంగళవారం తెలిపారు. మండలంలోని ఈతకోట గ్రామానికి చెందిన పేడూరి తరుణ్‌కుమార్ సోమవారం దేవరపల్లి నుంచి ఈతకోట వచ్చే రోడ్డు మార్గంలో తన బైక్‌పై నిర్లక్ష్యంగా నిలబడి, అతివేగంగా డ్రైవింగ్ చేయడంతో వెనుక కారులో వెళుతున్న ఒక వ్యక్తి దీనిని వీడియో తీసి సోషల్ మీడియంలో అప్‌లోడ్ చేశాడు. దీనిపై స్పందించిన రావులపాలెం ఎస్సై సుమోటోగా కేసు నమోదు చేశారు. యువకుడిని అరెస్టు చేసి, కొత్తపేట కోర్టులో ప్రవేశపెడతామన్నారు.

ఘనంగా పాఠశాల వార్షిక వేడుకలు

పి.గన్నవరం: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విశాఖ స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ ఎన్కే సత్యం అన్నారు. ఆర్.ఏనుగుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ అలరించారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంఈఓ కోన హెలీనా, సర్పంచ్ దొమ్మేటి పార్వతి, హెచ్ఎం బి.చిరంజీవిరావు, ఎంపీటీపీ యాండ్ర విజయలక్ష్మి, నాయకులు దొమ్మేటి వెంకటశివరామన్, కడలి శివరామకృష్ణ, నాగేశ్వరరావు, చప్పిడి శ్రీరామశెట్టి తదితరులు పాల్గొన్నారు.